


“మీరు తరుచు భూత రచనలు చేస్తూవుంటారు కదా. మీకు కీర్తి ఎలా వస్తుంది” అని నామీద జాలిపడి అడిగాడు బారా ఓ మంచి సాయంకాలం.

“నా జాతకంలో అంతే వున్నట్లుగా వుంది. గత పాతికేళ్ళుగా ఈ సాహిత్యవంట కార్యక్రమానికే నేను అంకితమైపోయాను” అన్నాను కాస్త దిగులుగా.

“అసలు మొదట ఈ రకంగా వంటలు ఎందుకు మొదలు పెట్టారు.

“ఒకానొకప్పుడు, నేను టీన్స్‌లో ఉన్నప్పుడు, మా యింటిపక్క ముసలవ్వగారి పేరుతో కొన్ని రచనలు చేశాను. అవి ఎందువల్లనో విపరీతంగా ప్రజాదరణ పొందాయి”

“గురూ ఆ రచనలు పదుముగా వుండేవా? వృద్ధాప్యపు వాసన వేసేవా?”

“అదే గమ్మత్తు. ఆ రచనలు నవయువ్వనంతో తొణికిసలాడేవి. నాగుండెల్లో వుండే స్వీట్ డ్రీమ్స్ అన్నీ అందులో కనిపించేవి. ఈ రచనలు చదివి అవ్వగారుకూడా కిర్రెక్కిపోయి తలకు రంగూ, పెదిమలకు లిప్‌స్టిక్కూ వేసుకునేది”

“తర్వాత?”

“ఆ తర్వాత ఒక సంఘ పెద్దతో పరిచయం ఏర్పడింది. ఆయన ఉపన్యాసాలూ, పత్రికా ప్రకటనలూ అవీ నేనే వండుతూండేవాడిని. ఆయనకు ‘డ్రామా’ అనే పదమ్మీద ప్రీతి మెండు. ఏ స్క్రిప్టు రాసి తీసికెళ్ళినా ఇంకా ‘డ్రామా’ రావాలండీ. డ్రామా! డ్రామా! అని గెంతుతూ వుండేవాడు.”

“ఈ భూతరచనా కార్యక్రమం చాలా క్లిష్టమైనదిలా కన్పిస్తున్నదే” అన్నాడు బారా సిగరెట్టును మట్టలా కాలుస్తూ.

“అవును ఏ రకంగా వండమంటే అలా వండాలి. కొందరికి ఉల్లిపాయలు లేకుండా ఉండాలి. కొందరికి అవిలేకపోతే నడవదు ఇంగువ ఉండాలి. ఉండకూడదు, తిరగమోత వేయాలి. వేయకూడదు. ఇలా—”

“అంటే?”

“కొందరికి వాక్యం రెండు అంగుళాలకంటె పొడుగు ఎక్కువ వుండకూడదు. ‘రాముడు మంచి పిల్లవాడు’ అన్నట్లుగా ఉండాలి వాక్యాలు. కొందరికి వొత్తులు వుండకూడదు. తెలుగులో వొత్తులు లేకుండా వ్రాయడం అసిధారావ్రతం. కొందరికి అంకెలు వుండకూడదు. మరికొందరికి అంకెలు లేకపోతే స్క్రిప్టు చప్పిష్‌గా వుంటుంది”

“పిండివంటలు కావాలనేవారు లేరా గురూ”

“ఎందుకు లేరూ ఓ మహానాయకుడు రాతలో చప్పుడు లేకపోతే మహ బాధపడి పోయేవాడు”

“ఈ వంట వండటంలో ఏమైనా కిటుకులున్నాయా గురూ?”

“బారాడియర్! విశ్వామిత్ర సృష్టిలో కిటుకులు లేకుండా ఉంటాయా. సంవత్సరం పొడుగునా వాడుకోవడానికి మధ్యతరగతి కుటుంబాల్లో ఆవకాయా, అప్పడాలూ, వడియాలూ పెట్టుకుంటారు అలాగే భూతరచయిత చేతిలో కొన్ని స్టాక్‌సీన్లూ, పడికట్టు పదాలూ ఉంటాయి. కొంచెం అన్నం వండుకుని ఆధరువులతో భోజనం చేసినట్టే వీటితో ఒక్కొక్కప్పుడు కథ నడిపించేయవచ్చు.”

“భూత రచయితకు పెద్ద ఛాలెంజి ఏదిగురో” అన్నాడు బా రా. బ్రహ్మాండమైన మూడ్‌లోకి వస్తూ.

“ఇంకోళ్ళ ‘స్వీయచరిత్ర’ రాయడం, వాళ్ళకి భాషను అరువు పెట్టడమే కాదు, అసలు సొంతం జీవితాన్నే తారుమారుచేసి రాయాల్సి వస్తుంది.”

“ఇందులో మనకు కొత్త ఏముంది. పూర్వం మన రాజులను ఇంద్రుడనీ చంద్రుడనీ మనకవులు పొగడలేదా” అన్నాడు బా. రా. గడుసుగా. బారా సాహిత్యాన్ని వ్యాపార దృష్టితోనూ, వ్యాపారాన్ని సాహిత్య దృష్టితోనూ చూడగల గొప్ప కళాశీలి.

“భవిష్యత్‌లో భూతరచయితలు కాబోయేవారికి నీ సలహా ఏమిటి గురూ” అన్నాడు చాలా సీరియస్‌గా బా.రా. రేడియో ఇంటర్వ్యూయర్ మల్లే మొహంపెట్టి.

“ఇప్పుడు చెప్పను. ఇంకో వాయిదాలో మనవి చేస్తాను”

నీతి: వంటవండే పద్ధతి ప్రధానం. దినుసులు కాదు. ○